శాకంబరిగా అమ్మవారు



రంగారెడ్డినగర్: ఏపీహెచ్‌బీ కాలనీలోని కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ కార్యాలయ ఆవరణలో ఉన్న కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో ఆషాఢ మంగళవారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిచారు. అమ్మవారు శాకంబరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 5 గంటలకు అభిషేకం, అలంకరణ, 10:30 గంటలకు నిర్వహించిన సామూహిక కుంకుమార్చనల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దేవి స్తోత్రమాలిక పారాయణం నిర్వహించి ప్రసాద వితరణ చేశారు.

ప్రధాన చౌరస్తాల వద్ద బొల్లార్డ్స్ ఏర్పాటు



సుభాష్‌నగర్: వాహనదారులు నిర్ణీత సమయంలో ఎలాంటి ఇబ్బందులు పడకుండా వారి గమ్యస్థానాలకు చేరడమే తమ లక్ష్యమని జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్ అన్నారు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జగద్గిరిగుట్ట, ఆల్విన్ కాలనీ రోడ్డులో ట్రాఫిక్ జామ్ కాకుండా రోడ్డు మధ్యలో బొలార్డ్స్ ఏర్పాటు చేశారు.

గ్రాడ్యుయేషన్ డే



చింతల్: చింతల్ భాగ్యరథి డిగ్రీ కళాశాలలో మంగళవారం గ్రాడ్యుయేషన్ డే ను ఘనంగా నిర్వహించారు. బీకాం కంప్యూటర్ అప్లికేషన్, బీబీఏ, బీఎస్సీ (అప్‌లైడ్ న్యూట్రిషన్, పబ్లిక్ హెల్త్) డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు సేవా భారతి కో ఆర్డినేటర్ ఓం ప్రకాష్ సర్టిఫికెట్లు అందజేశారు. విద్యా సంస్థల చైర్మన్ వెంకటరెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ జైశంకర్‌గౌడ్, ప్రిన్సిపాల్ నవీన్ రాజ్ విద్యార్థులకు సూచనలు చేశారు.

నిలిచిన ట్యాంకర్ల నీటి సరఫరా

ఆకస్మిక బంద్‌కు పిలుపు



ఫిల్లింగ్ పాయింట్ వద్ద నిలిచిన వాటర్ ట్యాంకర్లు

చింతల్: కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ కార్యాలయ పరిధిలోని ఆయా వాటర్ ట్యాంకర్ ఫిల్లింగ్ పాయింట్ల వద్ద ట్యాంకర్ ఓనర్లు, డ్రైవర్లు ఆకస్మిక బందుకు పిలుపునిచ్చారు. ఇప్పటికే కుత్బుల్లాపూర్‌లో అక్కడక్కడ నీరు సక్రమంగా సరఫరా కాక నీటి ఎద్దడి నెలకొంటుండగా.. అపార్ట్‌మెంట్ వాసులు ట్యాంకర్ల ద్వారా ఆ నీటి లోటును భర్తీ చేసుకుంటున్నారు. కానీ ట్యాంకర్ ఓనర్లు, జలమండలి అధికారుల మధ్య సమన్వయం కొరవడంతో మంగళవారం ఉదయం నుంచి అర్ధాంతరంగా టాంకర్లను నిలిపివేశారు. జీడిమెట్లలోని రెండు ఫీలింగ్ పాయింట్లు, షాపూర్ నగర్‌లో ఒక ఫీలింగ్ పాయింట్, కైసర్ నగర్‌లో మరో ఫీలింగ్ పాయింట్‌ల వద్ద మొత్తం 45 ట్యాంకర్ల వరకు ఆయా సెక్షన్ల పరిధిలోని వినియోగదారులకు, జీడిమెట్ల పారిశ్రామిక వాడకు నీటిని తరలిస్తుంటాయి. ఈ క్రమంలో మంగళవారం జలమండలి అధికారులకు ట్యాంకర్ ఓనర్లు, డ్రైవర్లు ఎటువంటి సమాచారం ఇవ్వకపోక ట్యాంకర్ల నేటి సరఫరాను నిలిపివేశారు. ఒక ట్యాంకర్ ప్రతిరోజూ 6 నుంచి 8 ట్రిప్పుల వరకు తిరుగుతాయి. దీంతో ప్రతిరోజు 120 నుంచి 150 ట్యాంకర్ల వరకు పంపిణీ చేస్తారు. మంగళవారం ట్యాంకర్ల ద్వారా నీటి పంపిణీని నిలిచిపోవడంతో బుకింగ్ సంఖ్య సాయంత్రం 5 గంటల వరకు 250 వరకు చేరింది.

ఆట స్థలం ఇలా.. ఆడుకునేది ఎలా?



రాళ్లు, రప్పలతో ఉన్న సుభాష్‌నగర్ ఆటస్థలం

జీడిమెట్ల: పట్టణాల్లో పిల్లలు ఆడుకోవడానికి అసలే ఆట స్థలాలు అంతంతే. అలాంటిది ఆట స్థలాలు ఉన్న చోట కొంతమంది స్వార్థపూరిత పనుల వల్ల ఆటలకు ఆటంకం ఏర్పడుతుంది. సుభాష్‌నగర్ గంపలబస్తీ సమీపంలో జీహెచ్‌ఎంసీకి చెందిన 1600 గజాల పార్కు స్థలం ఉంది. కాలనీ లే అవుట్ చేసే క్రమంలో పిల్లలు ఆడుకునేందుకు పార్కు స్థలాన్ని కేటాయించారు. అందులో ఆరు నెలల ముందు ప్రతినిత్యం సుభాష్‌నగర్‌కు చెందిన చిన్నారులు పార్కు స్థలంలో ఆడుకునేవారు. కొన్ని నెలల క్రితం ముందు సదరు పార్కులో కొంతమంది బిల్డింగ్ వ్యర్థాలను ఆట స్థలంలో డంప్ చేశారు. పార్కు స్థలం ఎత్తు పెరిగింది. అంతవరకు బాగానే ఉంది. కానీ సదరు స్థలం ఎత్తు ఒంపులు, రాళ్లరప్పలతో నిండటంతో అక్కడ పిల్లలకు ఆడుకోవడానికి అనువుగా లేకుండా పోయింది. దీంతో చిన్నారులు ఎక్కడ ఆడుకోవాలో అర్థంగాక రోడ్లపై ఆడుకుంటున్నారు. అక్కడ రాత్రిపూట కొంతమంది మద్యం తాగుతున్నారు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ అధికారులు పట్టించుకుని సదరు స్థలంలో మట్టితో చదును చేసి పిల్లలు ఆడుకునేలా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి

నిజాంపేట్: అర్హులు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నిరుపేదలకు సీఎంఆర్‌ఎఫ్ ఆరోగ్య భద్రత కల్పిస్తుందన్నారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.



డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడి..
ట్రాఫిక్ విధులు నిర్వహించి

కుత్బుల్లాపూర్: డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ ఇద్దరు వాహనదారులు మంగళవారం అల్వాల్ ట్రాఫిక్ పీఎస్ పరిధిలో ట్రాఫిక్ విధుల్లో పాల్గొన్నారు. శని, ఆదివారాల్లో నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో అతిగా మద్యం సేవించి పట్టుబడిన ఇద్దరిని సోమవారం ఆత్వేల్లి కోర్టులో ప్రవేశపెట్టగా ఒక రోజు పాటు ట్రాఫిక్ విధులు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించింది. దీంతో మంగళవారం అల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగరాజు పర్యవేక్షణలో ఇద్దరు వాహనదారులు మంగళవారం సుచిత్ర సర్కిల్‌లో ట్రాఫిక్‌పై అవాహన కల్పించారు.

గుర్తు తెలియని మృతదేహం స్వాధీనం

నిజాంపేట్: ఓ గుర్తు తెలియని మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. నిజాంపేట్‌లోని తుర్కా చెరువులో మృతదేహం ఉన్నట్లు స్థానికుల ద్వారా 100కు సమాచారం అందింది. వెంటనే సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి, డీఆర్‌ఎఫ్‌కు సమాచారం అందించాం. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతుడు నల్ల ప్యాంట్, తెలుపు చొక్కా ధరించి, నల్లపు రంగు చెప్పులు ఉన్నట్లు గుర్తించారు. అతని వయస్సు సుమారుగా 30 నుంచి 35 సంవత్సరాలు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఈ మేరకు బాచుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిధులు కేటాయించాలని వినతి



సీడీఎంఏ డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ మంగళవారం తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ కార్యదర్శి, సీడీఎంఏ డైరెక్టర్ శ్రీదేవిని కలిశారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని నాగులూరు, డి.పోచంపల్లి, దుండిగల్ తండాల్లో మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయించాలని వినతిప్రతం అందజేశారు. దీనిపై సీడీఎంఏ కమిషనర్ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ రాముగౌడ్, మాజీ పీఏసీఎస్ డైరెక్టర్ దేవేందర్, మాజీ సర్పంచ్ కావలి గణేష్ పాల్గొన్నారు.

చంద్రగిరినగర్‌లో పర్యటన

గాజులరామారం డివిజన్ చంద్రగిరినగర్‌లో నెలకొన్న సమస్యలపై శ్రీశైలంగౌడ్ పర్యటించారు. బంగారి మైసమ్మ ఆలయానికి వెళ్లే రహదారి పూర్తిగా ఛిద్రం కావడంతో జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబుతో మాట్లాడి రూ.48 లక్షల నిధులతో సీసీ రోడ్డును మంజూరు చేయించానన్నారు. స్థానికంగా డ్రైనేజీ, తాగునీటి సమస్యలు తలెత్తకుండా సంబంధిత అధికారులతో మాట్లాతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సతీష్, సంతోష్ యాదవ్, కావలి శ్రీనివాస్, వెంకటేష్, అమర్ లాల్, బాలరాజ్, కైలాష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



కుత్బుల్లాపూర్: కొంపల్లి మున్సిపల్ పరిధిలో నెలకొన్న సమస్యలపై మంగళవారం బీజేపీ అధ్యక్షుడు సతీష్ సాగర్ మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవని గార్డెన్‌లో డ్రైనేజీ, పోచంపల్లి రోడ్డులోని అపర్ణ పామ్‌గ్రూప్ నుంచి రాయల్ పార్క్ వరకు రోడ్డు, దూలపల్లి, జయభేరి, ఎన్.సి.ఎల్ కాలనీలోని పలు సమస్యలు నెలకొన్నాయని, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సరితారావు, శివాజీ రాజు, అశోక్, సూర్య ప్రకాష్, మహేందర్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఈదురు గాలులకు కూలిన చెట్లు, స్తంభం

కుత్బుల్లాపూర్: మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా వీచిన ఈదురు గాలులకు కొంపల్లి గ్రీన్ పార్కులో చెట్లు నేలకొరిగాయి. అదే విధంగా కాలనీ రోడ్డును ఆనుకుని ఉన్న విద్యుత్ స్తంభం పైభాగం విరిగి పడింది. స్థానికుల సమాచారంలో విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపి వేశారు.



ఆత్మహత్య చేసుకుంటానని భార్యకు ఫోన్.. ఆపై స్విచ్ఛాఫ్

కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు



నర్సయ్య

జగద్గిరిగుట్ట: ఆత్మహత్య చేసుకుంటానని భార్యకు ఫోన్ చేసి.. ఆపై స్విచ్ఛాఫ్ చేశాడు. ఈ ఘటన జగద్గిరిగుట్ట పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్ట రాజీవ్ గృహకల్పకు చెందిన నర్సయ్య(46), స్వప్న భార్యాభర్తలు. రోజు మాదిరిగానే మంగళవారం ఉదయం నర్సయ్య డ్యూటీకని చెప్పి తన ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. మధ్యాహ్నం భార్యకు ఫోన్‌చేసి ఆత్మహత్య చేసుకుంటుంనానని చెప్పి ఫోన్ ఆఫ్ చేశాడు. స్వప్న ఎన్నిసార్లు ఫోన్ చేసినా కలవకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.